క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

గుంతకల్లు : స్థానిక మోమీనాబాద్‌లోని మసీదులో మంగళవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. దాదాపు 50 మందిపైగా రక్తదానం చేసినట్లు ప్రభుత్వ ఖాజీ మౌలాన సయ్యద్ అబ్దుల్ రజాక్ ఖాద్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలతో సమానం అని కొనియాడారు. వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్‌బాషా, రెడ్ క్రాస్ మెంబర్ రంజాన్, నాయకులు ఎస్. అశ్రాఫ్ పీరా ఖాద్రీ, రహమన్‌సాబ్, హఫీసాబ్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మస్తాన్‌పేటలో మృతి చెందిన కాంతమ్మ(89) అనే అనాథ వృద్ధురాలి మృతదేహానికి మంగళవారం ఆ నలుగురు సేవాసమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మంజుల వెంకటేష్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి సంపత్ ఆచారి, కోశాధికారి చంద్రమౌళి, సభ్యులు రాజప్ప, మహేష్, లింగేశ్వర్, మారుతి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు



ట్రాక్టర్ నగర్‌లో వర్క్‌షాపు నిర్వహించిన అధికారులు

గార్లదిన్నె: మహిళలను లైంగికంగా వేధిస్తే కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం, న్యాయస్థానాలు ప్రత్యేక చట్టాలను ప్రవేశపెట్టాయని ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. మంగళవారం ట్రాక్టర్‌నగర్‌లో పని ప్రదేశంలో మహిళలపై జరిగే లైంగిక వేధింపులపై వర్క్‌షాపు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళల వెంటబడుతూ లైంగిక వేధింపులకు పాల్పడినా, మహిళల ఫొటోలు వారి అనుమతి లేకుండా ఫోన్లో తీసి లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టం ప్రకారం 3 నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. పని ప్రదేశంలో ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే మహిళలు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ట్రాక్టర్ నగర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ కమలా భాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో శాశ్వత భూ హక్కు



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

గార్లదిన్నె: ప్రభుత్వం భూ సర్వేతో రైతులకు శాశ్వత భూ హక్కు కల్పిస్తోందని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం మర్తాడులో రెవెన్యూ అధికారులు భూసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో మర్తాడులో భూ సర్వే చేస్తామన్నారు. భూ సర్వేతో రైతులకు ఉన్న భూ సమస్యలు, రస్తా వివాదాలు తొలగిపోతాయన్నారు. రైతులు భూ సర్వేకు హాజరయ్యే ముందు భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు సిబ్బందికి అందజేయాలన్నారు. రీ సర్వే ద్వారా ప్రతి రైతుకు ఎల్‌పీఎం ఆధారిత మ్యాప్ చేసి పట్టాదారు పుస్తకాలు మంజూరు చేస్తామన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



స్వామీజీని ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

గుంతకల్లు రూరల్: నెలగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచి విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజీ, మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి హాజరయ్యారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, కంకణధారణ, రుత్విగ్వరణం చేపట్టారు. సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ, పాటిల్ జయరామిరెడ్డి, ఎంపీపీ బీవీ మాధవి, మండల కన్వీనర్ మోహన్‌రావు, శ్రీధర్‌రెడ్డి, ఆనలుగురు ఫౌండేషన్ అధ్యక్షుడు మంజుల వెంకటేష్, రూరల్ ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నారా వైరస్ కరోనా కన్నా డేంజర్

- చంద్రబాబు మోసపూరితమైన హామీలు నమ్మొద్దు
- జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



పైలా నరసింహయ్యకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గుంతకల్లుటౌన్: అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు మరోసారి బూటకపు హామీలతో ప్రజలను మోసగించేందుకు కుట్రలు పన్నుతున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. నారా వైరస్ కరోనా కంటే చాలా ప్రాణాంతకమని, ఆ వైరస్ వలలో చిక్కుకుంటే మరణమే శరణ్యమన్నారు. టీడీపీని ఓడించడం ద్వారా నారా వైరస్‌ను తరిమికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వైవీఆర్, ఎంపీపీ మాధవి కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్ విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ జనరంజక పాలనకు జనం జేజేలు పలుకుతున్నారన్నారు. నేను మారిన మనిషినని చెప్పి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా, రైతు రుణమాఫీ తదితర 650 హామీలతో కూడిన మేనిఫెస్టోను పెట్టి అధికారంలోకి వచ్చాక చెత్తబుట్టలో పడేశారన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 98 శాతం హామీలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు ఇప్పుడెలా ఆల్ ఫ్రీ హామీలిస్తున్నారని ప్రశ్నించారు.

వారాహి యాత్రను అడ్డుకున్న బాబు

యువగళం పేరుతో రాజకీయ అజ్ఞాని నారాలోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్ర ఎక్కడ ఫెయిల్యూర్ అవుతుందోనని ఆందోళన చెందిన చంద్రబాబు పవన్‌కళ్యాణ్ నిర్వహించాల్సిన వారాహి యాత్రను అడ్డుకున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. చంద్రబాబు తన స్వప్రయోజనాల కోసం జూనియర్ ఎన్‌టీఆర్, తారక్‌లతో పాటు నందమూరి కుటుంబసభ్యులను రాజకీయంగా నాశనం చేశారని దుయ్యబట్టారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్న చంద్రబాబును మరోసారి రాష్ట్ర ప్రజలు బహిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, వైస్ చైర్మన్ పాండురంగారెడ్డి, కౌన్సిలర్ సుమోబాషా, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు భీమలింగప్ప, చింబిలి భాస్కర్, మల్లికార్జున శాస్త్రి, ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, సచివాలయాల కన్వీనర్ ఎండీ.ఖలీల్, పార్టీ మండల కన్వీనర్ మోహన్, గుత్తి నాయకులు మల్లయ్యయాదవ్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2024లో చరిత్ర తిరగరాస్తాం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అత్యధిక సీట్లను గెలవడం ద్వారా చరిత్రను తిరగరాస్తామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలన పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య ముందుగా సొసైటీ కార్యాలయం ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహంతోడాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగనన్న చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలంతా కలసి వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకురావడానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తామన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

పైలా నరసిహయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి, పథకాలు చేపట్టి మంచి చేస్తేనే ఓటు వేయాలని లేదంటే వద్దు అని ధైర్యంగా ప్రకటించారన్నారు. అయితే చంద్రబాబు మోసపూరిత మానిఫెస్టోను విడుదల చేసి ప్రజలను నమ్మించి మోసం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. గతంలో ప్రజలకు 600 హామీలను ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా 2024లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, యువనేత ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు వెంకటరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామగోపాల్, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, సుజాత, ఉప సర్పంచ్ వరలక్ష్మి, బలపనూరు అశోక్ కుమార్, నాయకులు పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, ముత్యాలశీన, కొండమ్మ, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ మేరకే జగనన్న పాలన

తాడిపత్రి టౌన్: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట మేరకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికిపైగా అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, మాజీ కౌన్సిలర్ సాయి, వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గణేష్, అన్వర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పరితపించే పార్టీ వైఎస్సార్‌సీపీ

యాడికి: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం రాయల చెరువు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నో పథకాలకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. నాయకులు నాగేష్, రషీద్, శివయ్య, రవికాంత్, చిన్న వెంకటనాయుడు, ఓబుళరెడ్డి, ఉపేంద్రగౌడ్, సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, హనుమంత రెడ్డి, జిలాన్, వెంకటనారాయణ రెడ్డి, ఉపేంద్ర గౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



రాయల చెరువులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నెట్టికంటుడి సన్నిధిలో సమాచార కమిషనర్



స్వామివారి ఆశీర్వచనాలను అందజేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: రాష్ట్ర సమాచార కమిషనర్ ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న సీఐ శంకర్‌రెడ్డి

పెద్దవడుగూరు : మండలంలోని హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని యాడికి రూరల్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో హోటళ్ల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

యల్లనూరు: మండలంలోని అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో మండల కేంద్రంలో దాడులు చేశారు. ఈసందర్భంగా రూ.800 నగదుతో పాటు పలువురు పేకాటరాయుళ్ల పట్టుకున్నారు.

ఘనంగా గంగపూజ

శింగనమల: శింగనమల చెరువు మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గంగపూజ ఘనంగా నిర్వహించారు. బెస్త వీధిలోని గంగమ్మ ఆలయం నుంచి బోనాలతో మత్స్యకారులు ఊరేగింపుగా చెరువులోకి వచ్చి అమ్మవారికి సమర్పించారు. మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి పాపారాయుడు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



యాడికిలో వేరుశనగ విత్తనకాయలు అందిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు

గుంతకల్లు రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కసాపురం రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం విత్తన వేరుశనగ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేరుశనగ ఎక్కడైనా నాణ్యతలేదని తేలితే రైతులు వెంటనే తిరిగిచ్చే అవకాశం కల్పిస్తున్నామన్నారు. కందుల పంపిణీని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపీపీ బీవీ మాధవి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, ఆర్బీకే చైర్మన్ బెస్త మనోహర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్, కోఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, విద్యార్థి సంఘం నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, వంశీ యాదవ్, నాయకులు సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రామలింగ, హరి, శంకర్, ఆర్బీకే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్బీకే లో విత్తనాల పంపిణీని ఏఓ మహబూబ్‌బాషాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొంబాయి రమేష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలో 567 మంది రైతులకు 520 క్వింటాళ్ల విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. గతంలో విత్తన వేరుశనగ కావాలంటే మండల కేంద్రంలో రైతులందరూ నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతులకు సొంత గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు అందజేస్తోందన్నారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, వీఏఏ రేష్మా, రైతులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ పథకాల పంట

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, పైలా నరసింహయ్య

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో ప్రతి గడపలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల పంట పండించారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజలకు ఉపయోగ పడే ఒక్క పథకం కూడా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టలేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా తయారు చేశారన్నారు. ప్రజల కష్టాలను చూసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసే ప్రజలకు అనుగుణంగా మేనిఫెస్టో రూపొందించారన్నారు. అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. సీఎం జగన్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని టీడీపీ నాయకలు ఓర్వలేక ఎల్లో మీడియా ద్వారా బురద జల్లుతున్నారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు పథకాలు వర్తింపజేసే విధంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

బాబు మాటలు నమ్మరు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలను గతంలో నమ్మించి అధికారంలోకి వచ్చాక గాలికి వదిలేశారన్నారు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా చంద్రబాబు మారకుండా మరోమారు మోసం చేయాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఏదైన కారణాల వల్ల సంక్షేమ పథకాలు రాకున్నా... వాటిని పరిశీలించాలని, సచివాలయ సిబ్బందికి, మండల అధికారులకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, తహసీల్దార్ మోహన్ కుమార్, వైఎస్సార్ సీపీ యువ నాయుడు ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, ఎంపీడీఓ విజయ భాస్కర్, సర్పంచ్ పార్వతి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామ గోపాల్, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, సుజాత, ఉప సర్పంచ్ వరలక్ష్మి, పూల నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, చేపల రమణ, ముత్యాల శీన, కొండమ్మ, పురుషోత్తం, చంద్ర మోహన్, ఎస్సీసెల్ నేత వరికూటి కాటమయ్య పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బుక్కరాయసముద్రం: దండువారిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిక్షణ

గుంతకల్లుటౌన్: స్థానిక సోఫియాస్ట్రీట్‌లోని ప్రభుత్వ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నెలరోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. పిల్లలకు తెలుగు చదువుట, రాయుట, చిత్రలేఖనం, స్పోకన్ ఇంగ్లీష్‌లతో పాటు చెస్, క్యారమ్స్, డ్యాన్సుల్లో శిక్షణ ఇప్పించినట్లు గ్రంథాలయాధికారి పి.కమ్మన్న తెలిపారు.

4న చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరం

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీరోడ్డులోని మార్కండేయస్వామి ఆలయంలో జూన్ 4న బహుత్తమ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో చిన్న పిల్లల ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గద్దం గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లా బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యులు జింకా దశరథ రామయ్య, హరిత పరీక్షలు నిర్వహిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

పామిడి: పీ కొండాపురం రోడ్డు శ్రీపురం టౌన్‌షిప్ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పీ కొండాపురం వాసి డీ మస్తాన్‌వలి బైక్‌పై పామిడి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. అలాగే గుంతకల్లు నుంచి పామిడి వైపునకు వస్తున్న బొలెరో వాహనం శ్రీపురం టౌన్‌షిప్ సమీపాన బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌వలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. ఈ మేరకుపోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తిలో..

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రైల్వే గేట్ వద్ద మంగళవారం బైక్‌పై నుంచి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోతుదొడ్డికి చెందిన రాములు పనిపై గుత్తికి బయలుదేరాడు. కర్నూలు రైల్వే గేట్ వద్ద అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. గాయపడిని అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూఐ మండల కార్యదర్శి నిర్మల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రామకృష్ణ, ఐద్వా మండలాధ్యక్షురాలు కవిత, సూర్యనారాయణ, మహేష్, సుంకన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లును జిల్లాగా ఏర్పాటు చేయాలని వినతి

గుంతకల్లు రూరల్: గుంతకల్లు కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అధ్యక్షుడు వై.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నాలుగు జిల్లాలను 8 జిల్లాలుగా విభజించారని, కానీ విస్తీర్ణం ప్రకారం 12 జిల్లాలుగా విభజించాల్సి ఉందన్నారు. ఆదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టి కోస్తా ప్రాంతానికి సమానంగా అసెంబ్లీ సీట్లను పెంచాలన్నారు. తీవ్ర కరువు జిల్లా అయిన అనంతపురంలో గుంతకల్లును మరో జిల్లాగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నిర్మలా కుమారి కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మామిడి, సపోటా , జామ, అల్లనేరేడు, దానిమ్మ, చీనీ, సీతాఫలం, మునగ వంటి పండ్ల తోటలతోపాటు మల్లె, గులాబీ సాగు చేసుకోవచ్చన్నారు. పండ్ల తోటలకు మూడేళ్లు, పూల తోటలకు రెండేళ్లపాటు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం లభిస్తుందన్నారు. ఐదెకరాల లోపు రైతులు రెవెన్యూ అధికారులు జారీ చేసిన చిన్న, సన్న కారు సర్టిఫికెట్‌ను జతచేసి, సంబంధించిన గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌కు మూడు రోజులపు అందజేయాలని సూచించారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయండి

యల్లనూరు: ప్రతి డీలరు చౌకడిపోల్లో తప్పకుండా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో చౌకడిపో డీలర్లు, యండియూ ఆపరేటర్లకు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ షాపు నంబరు, డీలరు పేరుతో ఉన్న బోర్డు పెట్టాలన్నారు. సక్రమంగా సరుకులు అందేలా చూడాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్వేత పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో నక్కా ఆంజనేయులు అనే నాటుసారా విక్రేతను మంగళవారం అనంతపురం టాస్క్‌ఫోర్స్, సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన నక్కా ఆంజనేయులు అనే వ్యక్తి గత కొన్ని నెలలుగా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్టు సెబ్ పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో మంగళవారం వేకువజామున అనంతపురం టాస్క్‌ఫోర్స్, సెబ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నక్కా ఆంజనేయులు ఇంట్లో రహస్యంగా దాచి ఉంచిన 16 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ ఎస్ఐ అలీ అహ్మద్ తెలిపారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

పామిడి: అప్పాజీపేట గ్రామానికి చెందిన లక్ష్మీనర్సమ్మ(45) మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచు రామాంజనేయులు మృతురాలి భర్త రంగయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ భాగ్య, డీలర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పామిడి: రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం పైగా నెరవేర్చారన్నారు. పట్టణ, రూరల్ సచివాలయాల కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు జోజోడే కుమార్, బోయ రామచంద్ర, సీ అబ్దుల్ రజాక్, అబుసాలేహా, షెక్షావలి, ఆదామ్, పార్వతీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.